క్లుప్తంగా

6లోగా పెన్షనర్లు ఈకేవైసీ చేసుకోవాలి



ఉపఖజానాధికారి వై.కామినాయుడు

సాలూరు: పట్టణంలోని ఉపఖజానా కార్యాలయం ద్వారా పెన్షన్ పొందుతున్న వారంతా తప్పనిసరిగా ఈ నెల 6 వ తేదీలోగా ఈకేవైసీ లింక్ చేసుకోవాలని ఉపఖజానాధికారి వై.కామినాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ, పెన్షనర్ సీఎఫ్ఎమ్ఎస్ ఐడి నంబర్‌తో ఆధార్‌నంబర్‌ను ఈకెవైసీ లింక్ చేయవలసి ఉందన్నారు. ప్లేస్టోర్‌లో హెర్బ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాలని, లేదా ఉపఖజానా కార్యాలయానికి వచ్చి ఈకేవైసీ లింక్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ చేసిన ఫోన్, సీఎఫ్ఎంఎస్ ఐడీ, పీపీఓ కాపీ, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకుని కార్యాలయానికి రావాలని సూచించారు.

వేంకటేశ్వర స్వామికి తులాభారం, కల్యాణోత్సవం



కంచర వీధి ఆలయంలో తులాభారం

బొబ్బిలి: పట్టణంలోని కంచరవీధిలో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి తులాభారం నిర్వహించారు. ముందుగా స్వామివారికి తులాభారం వేసి ఆ తరువాత చిన్నారులకు నిర్వహించారు. సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



సింగిరెడ్డివలసలో పారిశుద్ధ్య పనులు

తెర్లాం: మండలంలోని ఆమిటి, సింగిరెడ్డివలస, సీతారాంపురం, బొంగుపేట గ్రామాల్లో సోమవారం నుంచి ప్రారంభమైన శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సర్పంచ్‌లు చేపట్టారు. గ్రామాల్లోని రోడ్లుకు ఇరువైపులా, కాలువల్లోను, బోరుబావుల చుట్టూ బ్లీచింగ్, సున్నం కలిపిన పౌడర్‌ను వేశారు. పండుగ సందర్భంగా ప్రజలు చెత్తాచెదారాలను రోడ్లపై వేయవద్దని, గ్రీన్ అంబాసిడర్లు రిక్షాబండి తెచ్చినప్పుడు అందులో చెత్తను వేయాలని ఆమిటి, సింగిరెడ్డివలస గ్రామాల సర్పంచ్‌లు ప్రజలకు సూచించారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం



సంధ్య జన్మనిచ్చిన బిడ్డతో ఆశావర్కర్

వంగర: మండలంలోని పెదరాజులగుమ్మడ గ్రామానికి చెందిన గర్భిణి వావిలపల్లి సంధ్య 108 వాహనంలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఆమెకు పురిటినొప్పులు రావడంతో బంధువులు 108 వాహనానికి ఫోన్ చేసి, సమాచారమిచ్చారు. గ్రామానికి వాహనంతో చేరుకున్న ఈఎంటీ రాజారావు, పైలట్ అనీల్‌కుమార్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రభుత్వాస్పత్రికి ఆమెను తరలించారు. గరుగుబిల్లి మండలంలోని గొట్టివలస దగ్గరకు వెళ్లేసరికి ఆమె ప్రసవం జరిగి, ఆడబిడ్డ పుట్టిందని సిబ్బంది తెలిపారు.

ఓటమి విజయానికి నాంది..



ఇంటర్మీడియట్ ప్రత్యేక తరగతుల ప్రారంభోత్సవంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: ఓటమి విజయానికి నాందిగా భావించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండలంలోని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక్కసారి పరీక్షల్లో ఫెయిలైతే బాధపడాల్సిన అవసరం లేదన్నారు. మరోసారి బాగా చదువుకుని, మంచి మార్కులతో ఉత్తీర్ణత పొంది సత్తా చాటాలని తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, బి.వెంకటరావు, బి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన ఎర్ర జెండా

- ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

మక్కువ: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మక్కువ మండలంలోని మూలవలస, దుగ్గేరు, పెద్ద ఊటగెడ్డ గ్రామాల్లో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు, పీడిక అప్పారావు, కొర్ర గంగులు, బలియార్ సింగ్ తొడులు ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం మేడే స్ఫూర్తిని స్వీకరించి కార్మిక, కర్షక ఐక్యతతో పోరాడాలని ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ప్రభుత్వవిధానాలను ఎండగడుతూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

కలాసీల జెండా ఆవిష్కరణ

ప్రపంచ కార్మిక దినమైన మేడే సందర్భంగా కలాసీలు ఉదయం 9 గంటలకు కలాసీ సంఘం కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేసి మేడే ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.గోపాలం, వి.సూరిబాబు, అలమంచి అప్పారావు, పి.గంగరాజు, ఇ.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల ఆధ్వర్యంలో..

మండల వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో మేడే జెండాను కార్యాలయంలో ఆవిష్కరించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు జి.సాంబమూర్తి, జి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలకేంద్రంలో భవన, వ్యవసాయ అంగన్‌వాడీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికసంఘం మండల అధ్యక్షుడు శంకరరావు ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం హనుమాన్ జంక్షన్ వరకూ అరుణపతాకంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్ ఈశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకటరమణ, అంగన్వాడీ కార్యకర్తల సంఘం జిల్లా నాయకురాలు జి.జ్యోతి, ఐద్వా జిల్లా కార్యదర్శి వి.రామలక్ష్మి పాల్గొన్నారు. అలాగే లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మెయిన్ గేట్‌వద్ద ఏఐటీయూసీ జెండాను కార్మిక నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట: మండలకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ సీనియర్ నాయకుడు వంజరాపు సత్యంనాయుడు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ లక్షలమంది శ్రమజీవుల రక్తతర్పణాలు, వందలమంది బలిదానాల నుంచి ఆవిర్భవించిన అరుణోదయం కార్మిక దినం మేడే అన్నారు. కార్మికుల హక్కులు పరిష్కరించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని, కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని, ప్రభుత్వాలు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మన్మథరావు, సీటీటీయూ నాయకుడు జి.సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల ఐక్యత వర్థిల్లాలి

పార్వతీపురంటౌన్: కార్మికుల ఐక్యత వర్థిల్లాలని సీఐటీయూ నాయకుడు రెడ్డివేణు అన్నారు. పార్వతీపురం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాలైన మున్సిపల్ వర్కర్స్ అండ్ యూనియన్, రైస్‌మిల్లు, కలాసీ, ఆటో, తోపుడు బళ్లు, భవన నిర్మాణ కార్మికులు, ఆర్టీసీ కలాసీ, లగేజీ ఆటో కార్మికులతో పలు చోట్ల జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపథ్యంలో కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి. సూరిబాబు, దాసు, ఐద్వా నాయకురాలు రెడ్డి శ్రీదేవి తదితర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సాలూరులో..

సాలూరు: పట్టణం, మండలంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు సిద్ధాబత్తుల రామచంద్రరావు, ఎన్‌వైనాయుడుల ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. కార్మిక జెండాలను ఎగురవేశారు. మేడే స్ఫూర్తితో కార్మికులు ఐక్యంగా ఉంటూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కార్యక్రమాల్లో పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



మక్కువ: ర్యాలీగా వస్తున్న కార్మిక సంఘం నాయకులు



సీతానగరం: ర్యాలీ చేస్తున్న కార్మికసంఘం కార్యకర్తలు



సాలూరు: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ



బలిజిపేట: సీఐటీయూ కార్యాలయం వద్ద పతాకా విష్కరణ చేసిన నాయకులు, కార్మికులు



పార్వతీపురం టౌన్: జెండా ఆవిష్కరణ చేస్తున్న వామపక్ష నాయకులు



సీఐటీయూ ఆధ్వర్యంలో మామిడిపల్లిలో నిర్వహిస్తున్న కార్యక్రమం



సీతానగరం: ఎన్‌సీఎస్ కర్మాగారం ఎదుట పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్మిక యూనియన్ నాయకులు

మహిళా మార్టుల ఏర్పాటుకు ప్రాధాన్యం

- ఏపీఎం రెడ్డి శ్రీరాములు



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆర్ శ్రీరాములు

సీతానగరం: పొదుపుసంఘ సభ్యుల భాగస్వామ్యంతో మండల కేంద్రంలో అధిక మొత్తంలో మహిళా మార్టులు ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. ఈ మేరకు మహిళా మార్టుల ఏర్పాటుపై సీసీలు, సిబ్బందితో మండల వెలుగు కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యంతో నిర్వహించే మహిళా మార్ట్‌కు ముందుగా సభ్యుల వాటాధనంగా రూ.200 చెల్లించాలని, 400 మంది సభ్యులు ఇప్పటికి షేర్‌ధనం కట్టినట్లు తెలియజేశారు.

ఈ క్రమంలో మండలకేంద్రంలో నాణ్యమైన సరుకు, తక్కువ ధరకు, ఆరోగ్యకరమైన సరుకులు, పొదుపు సంఘం సభ్యుల ఆధ్వర్యంలో విక్రయించడమే మార్టుల ముఖ్యఉద్దేశమన్నారు. మండలంలో 1561 పొదుపు సంఘాలుండగా 18,400 మంది సభ్యులున్నారని తెలియజేశారు. డీఆర్‌డీఏ పీడీ సూచనల మేరకు అర్హులైన వారందరూ వ్యాపారాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవితకు బాటలు



విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వేలకోట్ల రూపాయలు వెచ్చిస్తూ విద్యార్థుల బంగారు భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ఎమ్మార్‌నగరంలో పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా 13మంది డిప్లమో విద్యార్థులకు నియామక పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఇంజినీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో ఉద్యోగ సంపాదనకు అవసరమైన నైపుణ్య శక్తిని పెంపొందించేందుకు ప్రతి పార్లమెంట్ నియోకవర్గానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌ను స్థాపించడమే కాకుండా ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో నైపుణ్యతా ప్రమాణాలను పెంపొందించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ స్థాయి స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఇక్కడ కళాశాలలో ఏర్పాటు చేయడం ఈ ప్రాంత విద్యార్థులకు ఒక వరం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విలియమ్స్ క్యారీ గ్రామ సర్పంచ్ వై.త్రినాథనాయుడు, బీఎస్ఎన్ఎల్ ఏజీఎం సురేష్ కుమార్, ఎస్‌డీఈ దామోదరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ



పెదభోగిలిలో మంచం పట్టిన వ్యక్తికి పింఛన్ అందచేస్తున్న సచివాలయ కన్వీనర్ కిరణ్‌కుమార్



గుచ్చిమిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్, గృహసారథి

సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో గ్రామ వలంటీర్లు సోమవారం ఉదయం 6 గంటలకే సచివాలయ కన్వీనర్లు గృహసారథుల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేయడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ మేరకు పింఛన్‌దారుల ఇళ్లకు ఉదయాన్నే వెళ్లి తలుపు తట్టిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమక్షంలో పింఛన్లు అందిపుచ్చుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న ఇంటికి పెద్ద దిక్కుగా తమను ఆదుకుంటున్నారని సంతోషం వెలిబుచ్చారు. మే డే ఉత్సవాన్ని పురస్కరించుకుని రెండురోజులు బ్యాంకులకు సెలవైనప్పటికీ ప్రభుత్వం తీసుకున్న ముందు జాగ్రత్తచర్యల కారణంగా పింఛన్లు 1వ తేదీన పంపిణీ చేయడం పట్ల లబ్ధిదారులు అభినందనలు తెలియజేశారు.



అప్పయ్యపేటలో ముస్లింలకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ



వెంకటాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్ బి ముకుందరావు

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బందలుప్పి గ్రామంలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రాష్ట్రాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా? అర్హులకు అన్యాయం జరుగుతోందా? తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ఉండడం వల్ల ప్రజలకు కూడా వారి సమస్యలను వెంటనే తెలియజేసి పరిష్కారం పొందుతున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

అర్థంలేని ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలు

ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే జోగారావు విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న నాయకులు బాదుడే బాదుడు అంటూ మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు, స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తైక్వాండోలో ఉచిత శిక్షణ

బొబ్బిలి: విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్లు కోచ్ బంకురు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విజేత స్కూల్ ఆవరణలో, సురేష్ స్కూల్ ఆవరణలో జిల్లా కోచ్ సీహెచ్ వేణుగోపాలరావు నేతృత్వంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఇవ్వనున్నామన్నారు. ప్రతీ రోజూ ఉదయం 6 గంటల నుంచి 7 వరకు, తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి 7 గంటల వరకు జరిగే శిక్షణలో పాల్గొని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదేళ్ల పిల్లల నుంచి పెద్ద వయసు వరకూ ఈ శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 7780760504ను సంప్రదించాలన్నారు.

డ్యాన్స్‌లో శిక్షణ

యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో 15 ఏళ్లలోపు బాల బాలికలకు డ్యాన్స్‌పై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు దాడితల్లి సిరిమానోత్సవం



అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పిస్తున్న పూజారులు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు, దాడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం ఘనంగా జరగనుంది. బొబ్బిలి, గొల్లపల్లితో పాటు చుట్టుపక్కల 12 గ్రామాల ప్రజలు దాడితల్లి పండుగను జరుపుకుంటారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు పూజారి బత్తిన సూరిబాబు సిరిమానును అధిరోహిస్తారు. అక్కడి నుంచి గొల్లపల్లి, మార్కెట్ మీదుగా బొబ్బిలి పురవీధుల్లో సిరిమాను ఊరేగుతుంది. తిరిగి తెల్లవారు జామున గొల్లపల్లి చేరుకుంటుంది. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సిరిమాను తిరిగే ప్రాంతాల్లో ఎటువంటి ఆటంకాలూ లేకుండా ఉండేలా సిబ్బందితో కలసి పర్యటించారు.

ఘనంగా తొల్లేళ్ల ఉత్సవం

దాడితల్లి అమ్మవారి పండుగలో భాగంగా సోమవారం తొల్లేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరెలు సమర్పించారు. భక్తులు ఘటాల వెంట తిరుగుతూ సందడి చేశారు.

జోరువానలో రాజన్నదొరకు ఘనస్వాగతం

- థింసా నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో హోరెత్తిన
- గిరిజన గ్రామాలు

సాలూరు:

అభిమాన నాయకుడైన ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర రాకతో మన్యం మురిసింది. ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పట్టుచెన్నేరు, పగులుచెన్నేరు, సొల్పగూడ, కోనదొర, ముడకారు, డోలియాంబ గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వచ్ఛమైన అడవితల్లి మార్గం గుండా వెళ్తున్న రాజన్నదొరకు చిరుజల్లులతో వరుణుడు స్వాగతం పలుకగా, గిరిశిఖర పట్టుచెన్నేరు, పగులుచెన్నేరు పంచాయతీ ప్రజలు అడుగడుగునా రాజన్నదొరకు బ్రహ్మరథం పట్టారు.తమ సంప్రదాయ థింసానృత్యాలతో పాటు బాలుర నుంచి వృద్ధుల వరకు గిరాగిరా తిరుగుతుంది ఫ్యాన్ వంటి జగన్ మోహన్‌రెడ్డి పాటలకు చిరునవ్వుతో డ్యాన్స్‌లు వేస్తూ, వాయిద్యాలు, స్థానిక అడవిలో లభించే పూల దండలతో ఘనంగా స్వాగతం పలికారు. వారి అభిమానానికి మంత్రముగ్ధుడైన రాజన్నదొర వారితో కలిసి అడుగులో అడుగు కలపడంతో జై జగన్ జై రాజన్నదొర నినాదాలతో మన్యం మార్మోగింది. ఈ సందర్భంగా రాజన్నదొర గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి చేకూరిన లబ్ధిని వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు.

ఆధార్ మార్చాలి

ఈ క్రమంలో వారి సమస్యలను అడగ్గా ముఖ్యంగా రోడ్డు సదుపాయం ఉన్న గ్రామాలకు కూడా 104,108 సేవలు అందడం లేదని, అంగన్వాడీ భవనం బిల్లు చెల్లించాలని ప్రజలు తెలపగా వాటిని పరిష్కరించాలని అధికారులను రాజన్నదొర ఆదేశించారు. తమ ఆధార్‌లు ఒడిశాకు అనుసంధానం కావడంతో సంక్షేమ పథకాలు కొందరికి అందడం లేదని, కావున ఆంధ్రాలో సంక్షేమ పథకాలు అందేలా ఆధార్‌మార్పు చేయించాలని కోరగా సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓను రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ, గిరిజనులకు అండగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గిరిజనులను మోసం చేయడానికి టీడీపీ నాయకులు మోసపూరిత అబద్ధపు మాటలు చెప్పుకుని వస్తారని వారిని నమ్మవద్దని హితవు పలికారు. నేను మీ వాడినని, నిజమైన గిరిజనుడిగా ఇక్కడివాడిగా మీ కష్టసుఖాలన్నీ నాకు తెలుసునని ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ప్రజలకు మేలు చేస్తుంది జగన్ అయితే, మోసం చేసింది చంద్రబాబు అని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబునాయుడుల పాలనల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు.ఎన్నికలు ఎప్పుడు జరిగినా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని మనమంతా జగన్ వెంటేనని ఓట్ల ద్వారా స్పష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, చోడిపల్లి బీసు, కూనేటి కుత్తే, కాశి, సామి, బేతురు, మాలతి, బిందు, కొండపల్లి సింహాచలం,ముద్దల ఆదయ్య, సువ్వాడ రామకృష్ణ, భరత్ శ్రీనివాస్, రఘుపాత్రుని సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు